మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పడీ వార్తలు అప్పుడే... 7 PM
సోమవారం 12 అక్టోబర్ 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు



- ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టులో పిటిషన్
- రాహుల్ గాంధీ సహా 11 మంది 'ఇండియా' కూటమి నేతల పిటిషన్
- ఓటర్లను భారీగా తొలగించారని, అవకతవకలు జరిగాయని ఆరోపణ
- సీజేఐ సూచన మేరకే కోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించిన రాహుల్
- విపక్షాల ఆరోపణలు నిరాధారమంటూ బీజేపీ ఎదురుదాడి

వివరాలు 2లో..

# మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లకు తుది రూపు

- మొత్తం 106 మున్సిపాలిటీలు, 17 కార్పొరేషన్లకు తుది జాబితా విడుదల
- మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు
- అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు 50 స్థానాలు కేటాయింపు
- రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో చైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది. ప్రకటించిన జాబితా ప్రకారం, 106 మున్సిపాలిటీలలో చైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు. అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు మొత్తం 50 స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం. కేటగిరీల వారీగా రిజర్వ్ చేయబడిన పురపాలక సంఘాల పూర్తి వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

కేటగిరీల వారీగా పురపాలక సంఘాల జాబితా
ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) – 3
ఎస్టీ – మహిళ: గూడూరు - మిగతా3లో

## ప్రతి నియోజకవర్గంలో ఒక శ్రీవారి ఆలయం

- శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఆలయాలు నిర్మించడమే లక్ష్యమన్న ఆనం
- ప్రతి నియోజకవర్గంలో రూ.5 నుంచి రూ.10 కోట్లతో శ్రీవారి ఆలయం
- 6,700 ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు



**అమరావతి**

రాష్ట్రవ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు ద్వారా 5,000 ఆలయాలను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు జిల్లాలో ఈరోజు జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ... రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఒక్కో శ్రీవారి ఆలయాన్ని - మిగతా3లో



## తిరుపతి స్వరూపం మారనుంది..

- వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన
- తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన
- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం
- భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం

## నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

- స్థలాన్ని మార్చగలరేమో కానీ ప్రజాగ్రహాన్ని మార్చలేరన్న కాంగ్రెస్
- ప్రభుత్వ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు
- స్థలం మార్చగలరేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేరని వ్యాఖ్య
- ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, గొంతు నొక్కే ప్రయత్నమని ఆరోపణ



# ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు



- కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్
- కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు

**హైదారాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (రా×=) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు–బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు–గిరిజనులు–బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని - మిగతా3లో



## టెండర్లలో భారీ అవకతవకలు

- రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్..
- రేడియల్ రోడ్ టెండర్లలో అవకతవకలంటూ రాజగోపాల్ రెడ్డి ఆరోపణ
- రూ.600 కోట్లు తక్కువకు బిడ్ వేసినా తమను తప్పించారని మండిపాటు
- సీఎం రేవంత్ శాఖలోనే దోపిడీ జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు

**హైదారాబాద్**

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్–2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు - మిగతా3లో

# ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?

- ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్
- సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి
- కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ



**హైదారాబాద్**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

మన సమస్య ప్రజావాణి RNI NO:TGTEL/25/A5443

సోమవారం 12 అక్టోబర్ 2026

## ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

-మొదటిపేజీ తరువాయి

రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## తిరుపతి స్వరూపం మారనుంది..

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

### భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది. రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

### టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

### మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లకు తుది రూపు

-మొదటిపేజీ తరువాయి

ఎస్టీ – జనరల్: ఆత్మకూరు, ఆలూరు

ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) – 14

ఎస్సీ – మహిళ: కొండపల్లి, నిడదవోలు, యలమంచిలి, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల.

ఎస్సీ – జనరల్: ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి.

బీసీ (వెనుకబడిన తరగతులు) – 35

బీసీ – మహిళ: జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, గుంతకల్, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.

బీసీ – జనరల్: కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు (నెల్లూరు), అద్దంకి, కమలాపురం, నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేల్.

జనరల్ కేటగిరీ (మహిళ)

ఈ కేటగిరీ కింద మొత్తం 27 మున్సిపాలిటీలను మహిళలకు కేటాయించారు.

కనిగిరి, వెంకటగిరి, నరసాపురం, పలాస–కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాలెం, యర్రగుంట్ల, యలమంచిలి, కళ్యాణదుర్గ్, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు.

అన్‌రిజర్వ్ (జనరల్)

కింద 26 మున్సిపాలిటీలు ఏ రిజర్వేషన్ పరిధిలోకి రాకుండా అన్‌రిజర్వ్‌గా ఉన్నాయి. పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, సాలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, తెనాలి, రామచంద్రాపురం, సత్తెనపల్లె, శ్రీకాళహస్తి, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గ్, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిపత్రి, పిడుగురాళ్ల. ఈ అధికారిక ప్రకటన వెలువడటంతో, మున్సిపల్ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల ఆధారంగా ప్రధాన రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదునుపెట్టడం, బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు కసరత్తులు ప్రారంభించనున్నాయి. రాబోయే రోజుల్లో పురపాలక రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

## నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం ఏకపక్షమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిరసన స్థలాన్ని నిర్ణయిస్తారని, ప్రభుత్వం కాదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం నిరసన స్థలాన్ని మార్చగలదేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించలేదని స్పష్టం చేశారు. సోమవారం ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ, "ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నాం. అందుకే ప్రతిపక్షాలన్నీ కలిసి బారాఖంబా రోడ్డుకు వెళ్తున్నాం. సాధారణంగా బోట్ క్లబ్‌లో నిరసనలు జరుగుతాయి. మీరు నిరసన వేదికలను మార్చవచ్చు, కానీ ప్రజల కోపాన్ని తగ్గించలేరు" అని అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా స్పందిస్తూ, "దీన్ని ఎలా రద్దు చేస్తారు? ప్రజాస్వామ్యంలో ఎక్కడ నిరసన చేయాలో ఎవరు నిర్ణయిస్తారు? అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడానికి భారతదేశంలోని ప్రతి అంగుళం స్వేచ్ఛాయుతమైనదే. ఈ స్వేచ్ఛను మాకు రాజ్యాంగం ఇచ్చింది" అని పేర్కొన్నారు. మరికొందరు కాంగ్రెస్ నేతలు తమదైన శైలిలో వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం ఈ దేశ పౌరులుగా మమ్మల్ని గుర్తించడం లేదు కాబట్టి, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాల్లో ఎక్కడైనా నిరసన స్థలం చూపిస్తే అక్కడికి వెళ్లి నిరసన తెలుపుతాం" అని సందీప్ దీక్షిత్ అన్నారు. హరియాణా ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ.. ప్రభుత్వం భయపడిందని, ప్రజల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. "ఢిల్లీ వారి తండ్రి ఆస్తి అన్నట్లుగా.. ఇక ఢిల్లీకి రావద్దని కూడా చెబుతారు" అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ విమర్శించగా, "ఇకపై హిమాలయాల శిఖరాలపై నిరసన చేస్తాం" అని మరో ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు. హోం మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన స్థలం జాబితా నుంచి డీ–నోటిఫై చేసినట్లు ఢిల్లీ పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. నిరసనల కోసం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు కొత్త ప్రదేశాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం కేంద్రం, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

## ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు

కేంద్ర ఎన్నికల సంఘం (జుజ×), ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ూ×=) ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 'ఇండియా' కూటమి నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా 11 మంది సీనియర్ నేతలు సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగతా రాయ్, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్, సీపీఎం నేత ఎం.ఏ. బేబీ, సీపీఐ నేత డి. రాజా, జేఎంఎం నాయకురాలు మహువా మాఝీ, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఈ.టీ. మహ్మద్ బషీర్ పిటిషనర్లుగా ఉన్నారు. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణకు రావలసి ఉంది. అంతకుముందు ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్‌కు లేఖ రాశామని, అయితే అధికారికంగా పిటిషన్ ద్వారా కోర్టును ఆశ్రయించాలని ఆయన సూచించారని రాహుల్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమతో కలిసి రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టారు.

### విపక్షాల ఆరోపణలు నిరాధారం: బీజేపీ

'ఇండియా' కూటమి ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ వివాదాన్ని విపక్షాలు రాజకీయ ప్రదర్శనగా మార్చాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గురు ప్రకాశ్ పాశ్వాన్ విమర్శించారు. ఆయన ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ, "విపక్షాల ఆరోపణలు పూర్తిగా నిరాధారం. వారు అబద్ధాలు చెబుతున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చింది" అని స్పష్టం చేశారు. అస్సాంలోని సిల్చార్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్‌లలో బ్యాలెట్ పేపర్లతో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని, దేశవ్యాప్తంగా ఎన్నికల్లో ఓడిపోతున్నందునే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

## టెండర్లలో భారీ అవకతవకలు

-మొదటిపేజీ తరువాయి

తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రతి నియోజకవర్గంలో ఒక శ్రీవారి ఆలయం

-మొదటిపేజీ తరువాయి

నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతి ఆలయానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 6,700 ఆలయాల్లో దూప, దీప, నైవేద్యాల కోసం అర్చకుల ఖాతాల్లో ప్రతినెలా రూ.10,000 జమ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.35 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి ఆనం శంకుస్థాపన చేశారు. సోమశిల జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా ఆత్మకూరుకు తాగునీరు సరఫరా చేస్తున్నామని, పట్టణంలో అంబేద్కర్, షాదీ మంజిల్ భవనాలకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని ఆయన అన్నారు.

## బలవంతపు భూసేకరణ ఆపాలి

**2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని గుడిపల్లి గ్రామ ప్రజలు**

**ఆంధ్ర ప్రదేశ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన**




**సోమందేపల్లి :** మండల కేంద్రంలోని గుడిపల్లి గ్రామ ప్రజలు గుడిపల్లి రిజర్వాయర్ ప్రతిపాదనను విరమించుకోవాలని, గ్రామ ప్రాచీన దేవాలయం అయిన శ్రీ సజ్జగంట రంగనాథ స్వామి దేవాలయం, మా భూములు, మా బోరు బావులు, పండ్ల తోటలు, పశువులతో పాటు మా జీవనోపాధిని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద రిజర్వాయర్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పెద్ద సుబ్బన్న రంగప్ప అధ్యక్షతన నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న, పెద్ద సుబ్బన్న, రంగప్ప లు మాట్లాడుతూ గుడిపల్లి గ్రామ చిన్న,పేద,దళిత, గిరిజన రైతులు పరిశ్రమలకు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు వ్యతిరేకం కాదని తెలిపారు. అందుకు అనుగుణంగానే ఇప్పటికే పరిశ్రమల కోసం ఎస్ఎల్ఏపి, బి హెచ్ ఇఎల్, ఎయిర్ బస్ ఏర్పాట్లకు భవిష్యత్ అవసరాల కోసం ఏపీ ఐఐసీ ద్వారా 1100 ఎకరాలు ఇచ్చి సహకరించామన్నారు. ఇప్పటికే భూములు కోల్పోయిన మా కుటుంబాల జీవనం ప్రశ్నార్థకంలో ఉందని మరో మారు సాగు, త్రాగునీరు పేరు చెప్పి మా గ్రామంలో రిజర్వాయర్ ప్రతిపాదన చేయడం మా కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే గ్రామంలో పలు దపాలుగా వేలాది ఎకరాలు భూసేకరణ చేయడం 2013 భూ సేకరణ చట్టానికి విరుద్ధమని భావిస్తు గుర్తు చేశారు. మా గ్రామానికి నష్టం చేసే రిజర్వాయర్ రద్దు కోసం అవసరమైతే మా గ్రామం నుండి మంత్రి సవితమ్మ ఇంటి వరకు పాదయాత్ర చేపట్టి మా ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతామని హెచ్చరించారు. రిజర్వాయర్ వల్ల ఉమ్మడి కుటుంబాలను విఛ్చిన్నం చేసి సంవత్సరానికి 3 పంటలు పండి వందలాది పశువులు, వేలాది గొర్రెలు మేకలు, పండ్ల తోటలు వల్ల ఉపాధి పొంది ఆహ్లాదకరమైన మా జీవనానికి ఇంకా మా విశ్వాసం భక్తి శ్రీకృష్ణదేవరాయల నాటి మా గ్రామ రక్షణ ప్రాచీన శ్రీ సజ్జగంట రంగనాథ స్వామి దేవాలయానికి నష్టం కలిగే గుడిపల్లి రిజర్వాయర్ ను వ్యతిరేకిస్తూ తహసిల్దార్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్నతాధికారులు నుండి ఎటువంటి ఆదేశాలు లేదా ఇరిగేషన్ నుండి ప్రతిపాదనలు కానీ లేవని మరింత నిర్దిష్ట సమాచారం రెండ రోజులలో తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి గ్రామ ప్రజలు సజ్జప్ప, వెంకట రమణ,ముద్దప్ప,లక్ష్మీనారాయణ,వెంకటప్ప, నరసింహులు, అంజనప్ప, రంగ, వెంకటేష్, శ్రీనివాసులు, సజ్జప్ప, లక్ష్మీనారాయణ, మూర్తి, చంద్ర, దినేష్ , ఆదినారాయణ,కళ్యాణ్, అంజి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## గోరంట్ల గ్రంథాల శాఖను తనిఖీ చేసిన.. జిల్లా కార్యదర్శి.



**గోరంట్ల :** గోరంట్ల శాఖా గ్రంథాలయమును ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ,కార్యదర్శి జె. శివప్రసాదు అకస్మిక తనిఖీ చేయడమైనది. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించడమైనది పరిశీలనలో అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహింపబడుతున్నట్లు గమనించడమైనది గ్రంథాలయ సెస్సు వసూలు కు కృషి చేయాలని గ్రంథాలయ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## బ్యాడనూరు జిల్లా పంచాయతీ ఆకాంక్షిగా పూజారప్ప.



**పావగడ :** పావగడ: కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీల రిజర్వేషన్లు ప్రకటించడంతో తాలూకాలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. రాష్ట్రంలో రానున్న జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతుండగా, రాజకీయ పార్టీల్లో సన్నాహాలు ముమ్మరమయ్యాయి. రైతుల గొంతుకగా పోరాటమే జీవితంగా, రైతు కుటుంబాలకు, అసహాయులకు అండగా నిలిచి నిరంతరం పోరాడుతున్నానని, ఈసారి బ్యాడనూరు జిల్లా పంచాయతీ స్థానానికి బలమైన ఆకాంక్షిగా ఉన్నానని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప తెలిపారు. కరువు, పంట నష్టం, అప్పుల భారం, విద్యుత్ సమస్య, నీటి కొరత, మద్దతు ధర కోసం పోరాటం.. ఇవన్నీ తుమకూరు జిల్లా రైతుల నిత్య సవాళ్లు అని, ఇలాంటి కష్ట సమయంలో రైతుల తరఫున నిరంతరం పోరాడుతున్నానన్నారు. పదవి కోసం కాదు, రైతుల ప్రయోజనాల కోసం ఎన్నో ఏళ్లుగా రైతుల సమస్యలకు గొంతుకగా నిలిచానని, ప్రతి పోరాటంలో ముందు వరుసలో ఉన్నానని చెప్పారు. శాశ్వత తాగునీటి పథకం కోసం జిల్లాలో పూజారప్ప నేతృత్వంలో జరిగిన నిరవధిక ధర్నా రాష్ట్ర దృష్టిని ఆకర్షించిందని, ఈ నిరంతర పోరాట ఫలితంగా తుంగభద్ర తాగునీటి ద్వారా కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతోందని తెలిపారు.

## మున్సీపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం.

**23 వార్డుల్లో 22 కోట్లతో పలు పనులకు భూమి పూజ.**



**పెనుకొండ :** మున్సిపాలిటీలో అభివృద్ధి ధ్యేయంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, పలు అభివృద్ధి పనులకు మంత్రి సవిత 22 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు సోమవారం కన్వీనర్ శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల 3.5 కోట్లతో నూతనంగా నిర్మించనున్న మున్సిపాలిటీ కి భూమి పూజ చేసి శిలా ఫలకం వేసినట్లు తెలిపారు. కన్వీనర్ శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు త్రివేంద్ర సమక్షంలో, గుత్తేదారు రామానాయుడు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కలిసి శ్రీరాములయ్య కాలనీ లో 9.60 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, మారుతినగర్ లో రూ.9 లక్షలు,జీఐసీ కాలనీ లో రూ.16 లక్షలు, న్యూ కాలనీ లో రూ.10 లక్షలు, పరమేశ్వరపురం లో రూ.12 లక్షలు, వజ్రాల పేట లో రూ.32 లక్షలు, దర్గా పేట లో రూ.22 లక్షలు,అర్బన్ కాలనీ లో రూ.5.40 లక్షలు, బోయపేట రూ.15 లక్షలు, వీఆర్ పల్లి లో రూ.6 లక్షలు, ఇస్లాపురం లో రూ.6.40 లక్షలతో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ గీత హనుమంత్, వడ్డే చంద్ర, సోము, శీనప్ప,నారాయణ నాయక్,చంద్రకాంతమ్మ, జనసేన శ్రీదేవి,రవి, మల్లికార్జున,హరి,సుబ్బు,మైనారిటీ నాయకులు బండా నూర్, షౌకత్,దాదు, హుజూరుల్లా, సాదిక్,టీడీపీ జనసేన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.